సుందర తీరం ప్రకృతి సోయగం


అందమైన యారాడ తీరం

- ధారకొండ.. భక్తిభావమే మది నిండా..
- శివలింగంపై జాలువారుతున్న గంగమ్మ
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

పెదగంట్యాడ: ట్రావెలింగ్ అంటే ఇష్టమా..అయితే తప్పకుండా ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే... మండలంలోని పరవశింపజేసే ఎన్నో ప్రాంతాలు ఉన్నాయి. అందులో పర్యాటకులను ఇట్టే ఆకర్షించే ప్రాంతం ఇక్కడ ఉంది. పచ్చని కొండలు, అడవుల్లో విహరించడం..జలపాతాల్లో స్నానం చేయడం వల్ల కూడా ఆనందం.. గురించి మాటల్లో చెప్పలేం. వాటిని కనులారా వీక్షించి.. ఆపై అక్కడే గడిపితే ఆ అనుభూతే వేరు.. ఆస్వాదించాలనే మనసుండాలే గానీ వీచే గాలి కూడా అద్భుతమే.. కొండలు.. వాటి మధ్య నుంచి జాలువారే జలపాతాలు.. సెలయేర్లు.. నదులు ఇలా చెప్పుకుంటే పోతే ఎన్నెన్నో అందాలు.. అటువంటి ప్రదేశాల్లో యారాడ తీరం ఒకటి. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. మండలంలో ప్రకృతి గీసిన చిత్రాలెన్నో ఉన్నాయి. కొండలు.. కొబ్బరి చెట్లు కోనసీమను తలపిస్తాయి.. ఈ ప్రాంతాన్ని ఒక్కసారి తిలకిస్తే చాలు ఎన్నో ఎన్నెన్నో మధుర స్మృతులు.. అంతేకాకుండా గంగవరం గ్రామానికి ఆనుకొని మరో ప్రాంతం ఉంది. అదే ధారకొండ... అయితే ఇక్కడ ప్రకృతి అందాలతో అక్కడ కొలువుదీరిన శివలింగం.. దానిపై నుంచి జాలువారుతున్న గంగమ్మను చూస్తే ఎవరైనా మైమరచిపోవాల్సిందే.. భక్తి భావంతో పులకించిపోవాల్సిందే.. చుట్టూ ఎత్తయిన కొండలు.. ఎటువైపు చూసినా పరుచుకున్న పచ్చదనం.. కొండల మధ్య నుంచి.. పచ్చని చెట్లను తాకుతూ సన్నగా.. జల జల జారుతూ.. గల గల పారుతూ వస్తోంది ఓ ధార.. అది ఎక్కడి నుంచి వస్తుందో.. ఎక్కడ పుట్టిందో.. దాని జన్మ స్థలమెక్కడుందోనని.. దాని రహస్యాన్ని తెలుసుకుందామని చేయని ప్రయత్నం లేదు. మండు వేసవిలో సైతం అదేవిధంగా ధారగా రావడం విశేషం.. జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని గంగవరం గ్రామానికి ఆనుకొని.. యారాడ వెళ్లే ప్రధాన రహదారి పక్కన.. భార్గవ్ ఆర్ట్స్ స్టూడియో లోపల ఉందీ ధార కొండ.. ఇక్కడ ఉన్న శివలింగాన్ని దర్శించి.. కోర్కెలు కోరుకుంటే ఇట్టే నెరవేరతాయని ఇక్కడి వారు చెబుతున్నారు.



శివలింగంపై పడుతున్న ధార

ప్రకృతి సోయగం.. పాత గంగవరం తీరం

మండలంలోని పాత గంగవరం తీరం ప్రకృతి సోయగాన్ని తలపిస్తోంది. ఈ ప్రాంతం చిత్ర పరిశ్రమకు సుపరిచితమే.. ఇక్కడ పలు చిత్రాలను చిత్రీ కరించారు. ఆ సినిమాలన్నీ విజయవంతం కావడం విశేషం. అంతేకాకుండా ఇక్కడ కొండపై ఉన్న మాధవస్వామి ఆలయం కూడా ప్రసిద్ధికెక్కింది. ఏటా జనవరి నెలలో వచ్చే కనుక రోజు ఇక్కడి స్వామి వారిని భక్తులు దర్శించుకుని రోజంతా అక్కడే ఉల్లాసంగా గడుపుతారు.

అప్పికొండ తీరం.. మణిహారం

జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ తీరం మండలానికే మణిహారంగా నిలుస్తోంది. ఇక్కడి సముద్ర తీరం.. ఆపై అప్పికొండ సోమేశ్వరస్వామి వారి ఆలయాన్ని దర్శించుకోవడానికి నిత్యం వందలాది మంది వస్తుంటారు. సముద్ర తీరంలో ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడుపుతారు.


అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం

ఇంటింటికీ ఆరోగ్య రక్ష


మిందిలో వృద్ధురాలికి రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


లంకెలపాలెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వార్డు సచివాలయ సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ఎంతో మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోందని 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్ అన్నారు. మంగళవారం వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెం సచివాలయంలో పీహెచ్‌సీ సిబ్బంది, సచివాలయాల ఏఎన్ఎం, వార్డు వలంటీర్లకు జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించారు. దశల వారిగా ప్రజలకు ఏవిధంగా జగనన్న సురక్ష ద్వారా ఏయే వైద్య సేవలందిస్తారో మండల లెవెల్ ఆఫీసర్ వెంకటేష్ వివరించారు. అక్టోబర్ 12న మిందిలో గల గుడివాడ అప్పన్న కళ్యాణ మండపంలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులు ఇవ్వనున్నారన్నారు. కార్యక్రమంలో నాలుగు వార్డు కన్వీనర్ మహ్మద్ గౌస్, సచివాలయ ఏఎన్ఎం మహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు వరదాడ వెంకటరమణ, నంబారు రాజు, సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో 68వ వార్డు మిందిలో ఇంటింటికి వెళ్లి వైద్య సిబ్బంది బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎం.జగదీశ్వరి, సచివాలయ ఏఎన్ఎం డి.శ్రీదేవి, ఆశా వర్కర్ డి.అరుణ, మనీషా కళాశాల బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

అగనంపూడి: ప్రతీ ఒక్కరి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవడం, సరైన వైద్య సేవలు అందించడం జగనన్న సురక్ష పథకం ముఖ్యఉద్దేశ్యమని 79వ వార్డు లంకెలపాలెం వార్డు సచివాలయ ఆరోగ్య కార్యదర్శి జ్యోతి అన్నారు. లంకెలపాలెం వార్డు సచివాలయ పరిధిలోని కాలనీలు, గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. ప్రతీ ఇంటికి వెళ్లి రక్త పరీక్షలు, బీపీ ఇతర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

గాజువాక: మహిళలు స్వయం సమృద్ధి దిశగా రాణించాలని 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ అన్నారు. స్థానిక శ్రీనగర్‌లోని సీఎల్‌సీ చర్చిలో సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల పేద మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టు మిషన్లద్వారా సంపాదించిన ఆదాయంతో కుటుంబానికి చేదోడుగా నిలిచేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉచితంగా కుట్టుమిషన్లను అందజేసిన సీఎల్‌సీ నిర్వాహకులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. పేదవర్గాలను గుర్తించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వీవర్స్ అసోసియేషన్ నాయకుడు పప్పు రాజారావు, సంస్థ చైర్మన్ బిషప్ మహంతి, ప్రతినిధులు ఆల్ఫ్రెడ్ మహంతి, మెర్సీ తదితరులు పాల్గొన్నారు.


కుట్టు మిషన్లను అందజేస్తున్న కార్పొరేటర్ స్టాలిన్ తదితరులు

క్లుప్తంగా

ఘనంగా స్మార్ట్ ఇండియా హాక్‌థాన్


హాక్‌థాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో స్మార్ట్ ఇండియా హాక్‌థాన్ పోటీలు నిర్వహించారు. కళాశాలకు చెందిన వివిధ విభాగాల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. 198 టీమ్స్‌లో హార్డ్ వేర్, సాఫ్ట్‌వేర్ రంగాల నుంచి 35 టీమ్స్‌ను ఎంపిక చేసినట్టు కళాశాల రెక్టార్ వి.మధుసూధనరావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ ఇండియా హాక్‌థాన్‌లో ఎంపికైన విద్యార్థులు ప్రభుత్వం నిర్వహించే స్మార్ట్ హాక్‌థాన్ కార్యక్రమంలో పాల్గొనున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, శ్రీనివాస్ నాయక్, మోహన్ మహంతి, చిగిలిపల్లి భరత్‌కుమార్, గిరీష్ భయోగడే, వీవీ రమణ, అర్చన, శ్రీను, వీరు తదితరులు పాల్గొన్నారు.

వినాయకునికి పంచామృతాభిషేకం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడకలోని సంపత్ వినాయక ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రుల సందర్భంగా పంచామృతాభిషేకం జరిపించారు. పంచామృతాభిషేకం, గణపతి హోమం పూర్ణాహుతి అనంతరం స్వామి వారికి వెండి కవచధారణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నాతయ్యపాలెంలో అన్నసమారాధన


నాతయ్యపాలెంలో అన్నసమారాధనలో పాల్గొన్న తిప్పల దేవన్ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో శ్రీ సిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగ మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం మహోత్సవాల్లో భాగంగా శ్రీ సిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధనను వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి, గాజువాక వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ తిప్పల దేవన్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా ఫుడ్ విజిలెన్స్ కమిటీ మెంబర్ బోగాది సన్యాసిరావు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ మహాజన సభ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ 58వ మహాజన సభ బుధవారం జరగనున్నది. సెక్టార్-1, స్టీల్‌క్లబ్ ఆడిటోరియంలో సాయంత్రం 6 గంటలకు జరగనున్న జరగనున్న సభకు సభ్యులందరూ హాజరు కావాలని సొసైటీ కార్యదర్శి డి.ఎస్.ఆర్.సి. మూర్తి కోరారు.

రంగస్థల విభాగ విద్యార్థినికి అభినందన


సాయిప్రియను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రంగస్థల విభాగం విద్యార్థిని ఎం.సాయిప్రియను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. నాటకం, నృత్యం, వ్యాఖ్యానం, ఆహార్యం తదితర రంగాలలో సాయిప్రియ చూపుతున్న ప్రతిభకు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఈ సందర్భంగా వీసీ తన కార్యాలయంలో ఆమెను సత్కరించారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎం.భాస్కరరావు, డాక్టర్ ఎం.శశిభూషణరావు, రఘురాం, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, అందుకు అనుగుణంగా ప్రణాళిక ప్రకారం పని చేస్తున్నామని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. వార్డు పరిధిలోని నెహ్రూనగర్‌లోని స్వయం సహాయక సంఘాలతో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హత ఉన్నా పథకాలు అందకపోతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టామన్నారు. అంతేకాకుండా రోడ్లు, డ్రైన్లు కొత్తగా నిర్మించామన్నారు. వీధి దీపాలు సక్రమంగా వెలుగుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీవో శంకరరావు, టీఎల్ఎఫ్ ఆర్పీ వరలక్ష్మి, పార్వతి, సంతోషి, గురమ్మ, అనూష, సంతోషి, రేఖ పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తత అవసరం

పెదగంట్యాడ: నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హార్బర్ సబ్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నేరాల నియంత్రణపై మండలంలోని నెల్లిముక్కులో మహిళలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు విలువైన బంగారు ఆభరణాలు వేసుకుని ఒంటరిగా వెళ్లవద్దన్నారు. చైన్‌స్నాచర్ల బెడద ఎక్కువగా ఉందని, ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే బంగారు ఆభరణాలు ధరించి ఇళ్లలోని కిటికీల వద్ద నిద్రించవద్దన్నారు. అంతేకాకుండా వాహనాలకు తాళాలు వేసి ఉంచాలని, జీపీఎస్ వంటి సాంకేతికతను వినియోగించుకోవాలని కోరారు. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే పెద్ద నష్టాన్ని నివారించవచ్చని వివరించారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యూపోర్టు క్రైం ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న హార్బర్ సబ్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

ఉక్కు జోలికి వస్తే చరిత్ర హీనులవుతారు


దీక్షలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోబోమని, విశాఖ ఉక్కు జోలికి వస్తే చరిత్ర హీనులవుతారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే దీక్షలు మంగళవారం నాటికి 957వ రోజుకు చేరుకున్నాయి. పలు విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధి పనుల పరిశీలన

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం చెరువుల ఆధునికీకరణ, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని 68వ వార్డు వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్ తెలిపారు. దీనిలో భాగంగా వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెంలోని చెరువు అభివృద్ధి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. చెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులకు రూ.1.48 కోట్లువెచ్చిస్తున్నారని తెలిపారు. త్వరతిగతిన చెరువు అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వరదాడ వెంకటరమణ, నంబారు రాజు, సయ్యద్ హుస్సేన్, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.


68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న గుడివాడ లతీష్

తిరుమల వాసా వెంకటేశా


పాల్గొన్న భక్తులు


తిరుమల బాలాజీకు శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అక్కిరెడ్డిపాలెం: తిరుమల తిరుపతి వేంకటేశ్వరునికి మంగళవారం పుట్టిన రోజును పురస్కరించుకొని విశేష పూజలు జరిగాయి. తిరువేంగడ ముడయాన్ తిరునక్షత్రం వేంకటేశ్వర స్వామి వారి పుట్టిన రోజును భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల శ్రీ వినాయక స్వామి, వేంకటేశ్వర స్వామి వార్ల ఆలయంలో ప్రసన్న వేంకటేశ్వరునికి చామంతులతో అర్చన నిర్వహించారు. ఆలయంలో నాతయ్యపాలెంకు చెందిన మహిళలు కోలాటం నిర్వహించారు.

షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో...

షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా బాలాజీకు శాంతి కల్యాణం నిర్వహించారు. విశేషంగా భక్తులు మహోత్సవంలో పాల్గొన్నారు.

మిల్లెట్స్‌తో ఆరోగ్యం పదిలం


సదస్సును ప్రారంభిస్తున్న ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేశ్వరి


మిల్లెట్స్ ప్రయోజనాలను తెలుసుకొంటున్న విద్యార్థులు

గాజువాక: మిల్లెట్స్‌ను వినియోగించడంవల్ల లభించే ప్రయోజనాలపై స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రా యూనివర్సిటీ ఫుడ్ న్యూట్రిషన్ అండ్ డయాబెటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రాజేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనవుల ప్రస్తుత జీవన విధానం సరిగా లేదని పేర్కొన్నారు. ఈ కారణంగా తరచూ అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. మంచి ఆహారపు అలవాట్లవల్ల ఆరోగ్యం సక్రమంగా ఉంటుందని పేర్కొన్నారు. మానవాళికి మిల్లెట్స్ భవిష్యత్ ఇంధనం అని పేర్కొన్నారు. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలను మనిషి తన జీవన విధానంలో అలవాటు చేసుకోవడంవల్ల ఆయుఃప్రమాణాలు పెరుగుతాయన్నారు. మిల్లెట్స్ తీసుకోవడంవల్ల డిప్రెషన్, ఒత్తిడి తగ్గుతాయన్నారు. డయాబెటిస్, అతిగా టెన్షన్‌కు గురికావడం ఉండవని అన్నారు. సరైన పోషకాలు శరీరానికి అందించడంవల్ల రోగ నిరోధకశక్తి పెరిగి ఎటువంటి ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడతాయన్నారు. విద్యార్థులు చిన్నతనంనుంచే మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. మిల్లెట్స్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వి.కృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ఈశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెదగంట్యాడలో 'జగనన్నకు చెబుదాం '

పెదగంట్యాడ: మండలంలోని ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ మల్లికార్జున మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ వెనుక గల ఇండస్ట్రీయల్ పార్క్ , రోడ్ నంబర్ 10లో గల పివా కమ్యూనిటీ హాల్ లో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రతి సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమాన్ని మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో మండల స్థాయిలో నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల హెచ్‌వోడీలు, జీవీఎంసీ అధికారులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలు అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పై అవగాహన

పెదగంట్యాడ: పేదల మేలు కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 65వ వార్డు పార్టీ కార్యలయంలో వార్డు పరిధిలో గల సచివాలయాల సిబ్బందితో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఎక్కడాలేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు.ఇంటింటా ప్రజలు ఆరోగ్యంపై సర్వే చేసి వైద్య సేవలందించేలా చేపట్టాల్సిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.


సురక్ష పై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు

ఎంఎస్ సుబ్బలక్ష్మి ప్రచార్య పురస్కార గ్రహీతకు సత్కారం

ఏయూ క్యాంపస్: డాక్టర్ ఎంఎస్ సుబ్బులక్ష్మి ప్రచార్య పురస్కారం అందుకున్న ఏయూ సంగీత విభాగం ఆచార్యులు సరస్వతి విద్యార్థిని మంగళవారం ఉదయం విభాగంలో ఘనంగా సత్కరించారు. ఇటీవల శ్రీ షణ్ముఖానంద సభ నుంచి ఆమె ఈ పురస్కారం స్వీకరించిన సందర్భంగా విభాగ ఆచార్యులు, విద్యార్థులు ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును అందుకున్న తొలి తెలుగు వ్యక్తి ఆచార్య సరస్వతి విద్యార్థి కావడం వర్సిటీకి గర్వకారణమన్నారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ భారతీయ సంగీతం , సాహిత్యం ఎంతో విశిష్టమైనవన్నారు. ఏయూ సంగీత విభాగం దశాబ్దాలుగా ఎందరో గాయకులను తీర్చిదిద్ది సమాజానికి అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య అనూరాధ, విభాగ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



సరస్వతి విద్యార్థిని సత్కరిస్తున్న రెక్టార్ ఆచార్య సమత, ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

నాయకత్వం, నైపుణ్యాలపై అవగాహన

ఏయూ క్యాంపస్: నాయకత్వ లక్షణాలు వ్యక్తి ప్రగతిని, వ్యవస్థ వికాసాన్ని ప్రభావితం చేస్తాయని వీడీఎం ఇండియా ఆన్ దమూవ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ఆచార్య అజిత్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నాయకత్వ నైపుణ్యాలు అనే అంశంపై మాట్లాడారు. సమూహంగా పని చేయడం, సమష్టిగా విజయం సాధించడం, నాయకత్వం వహించడం వంటి విభిన్న అంశాలను విద్యార్థులకు వివరించారు. వ్యక్తిగా ప్రస్థానాన్ని ప్రారంభించి, వ్యవస్థను ప్రభావితం చేసే వ్యక్తులుగా ఎదగాలన్నారు. నాయకత్వంలో విధానాలు, పెంపొందించే అంశాలు, ప్రాధాన్యతలను తెలియజేశారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె. భట్టి, విభాగాధిపతి ప్రజ్ఞ, తదితరులు పాల్గొన్నారు.


అజిత్‌కుమార్‌ని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.కె.భట్టి, తదితరులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ హార్ట్ సెంటర్ సహకారంతో నిర్వహించిన ఉచిత గుండె పరీక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఏయూ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ గరికపాటి మహేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఏయూ ఉద్యోగులకు రక్త పరీక్షలు, ఈసీజీ, ఎకో, బీపీ పరీక్షలు చేశారు. రిపోర్టుల ఆధారంగా ఉద్యోగులకు అవసరమైన చికిత్స విధానాలు, సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ సమన్వయం చేశారు.